అట్లా వీలులేదన్నాను నేను.

"నేన్నీదగ్గర తినను," అంది శ్రీదేవి.

"అయితేనేను నీదగ్గిర తింటాలే" అన్నానునేను.

శ్రీదేవి వాకటే నవ్వింది. చూడకుండా ఆవ కాయముక్క కొరికి నోట్లో పెట్టాను. ముక్క కిందపడకుండా, థూ, అన్నది.

మళ్ళీవచ్చేటప్పుడు, రావిచెట్టుకింద, గిన్నెలో అన్నం తింటున్నాడు వాడు. కుక్క కూడా గిన్నెలో మూతిపెట్టి తింటున్నది.

ఎడంచేత మీసం మెలేస్తూ "ఎవడురా నా మీది కొచ్చేది?" అంటున్నాడు వాడు. నావైపు అదోలా చూశాడు.

శ్రీదేవి చేయి గట్టిగా పట్టుకున్నాను.

శ్రీదేవి మొహాన్ని నవ్వువెల్లువ ముంచేసింది.

---

బ్రతుకు తెరువులో

# ఉపాసించ దగిన కళ

## మధిర భానుమూర్తి

ఎవరి దగ్గిరకేనా వెళ్ళి ఆయనను గురించే ఆయనతో మాట్లాడడం చాలా కష్టమయిన పని. ప్రపంచంలో ఉన్న విషయాలన్నీ చాలా కులాసాగా చర్చించిన మనం ఆయన విషయమే ఆయనతో మాట్లాడవలసి వచ్చేసరికి ఒక్కసారి తగ్గవలసి వస్తుంది. ప్రత్యక్షంగా మనముందున్న వ్యక్తితో ముఖాముఖిని ఆవ్యక్తినిగురించే మాట్లాడ టానికి మనకు ధైర్యంచాలదు. మానవుడు ఎన్నో క్లిష్టసమస్యలను సునాయాసంగా పరిష్కరించ వచ్చు, ఎన్నో అత్యద్భుత విషయాలను సాధించ వచ్చు, ఎన్నో అవాంతరాలను అవలీలగా దాట వచ్చును గాని ఈ సందర్భాన్ని ఎదుర్కోవలసి వస్తే అంతవాడూ ధైర్యం జారిపోయి చేతకాని వాడవుతాడు. మాట్లాడటానికే ఇంత ఇది ఉంటే ఆవ్యక్తిని ముఖంమీద ప్రశంసించవలసివస్తే ఇంకా ఎంత అవస్థపడవలసి వస్తుందో తేలికగా ఊహించ వచ్చు.

అసలు దీని ప్రయోజనమేమిటి?...మానవుడికి సహజంగా పొగడ్తలకి లొంగే గుణంఉంది గనక దాన్ని ఆధారంగా చేసుకుని మనకు అవసరమైన పని వచ్చినప్పుడు ఆపని చెయ్యగల వ్యక్తిని నాలుగు మాటలతో ప్రశంసించి మనపని చేయిం చుకోవచ్చును. ఈ పొగడ్తలకి లొంగే వ్యక్తిలో "నలుగురి చేతా ఇలాగ పొగిడించుకోవాలి." అనే తృష్ణఉంటుంది కనుక ఇతరులు పలికే ప్రశంసా వాక్యాలతో ఈ తృష్ణఅణిగి, అతడు సంతృప్తుడై, ఆ శుభసమయంలో వెంటనే నీకు ఏపని కావలసినా చేస్తాడు. అయితే ఆవ్యక్తి ఆరకం తృష్ణలేని వాడయితే నీ ఆటలు సాగవు. అలాంటి వాడిని నువ్వు ఎంతగా స్తుతించినా నీకు వచ్చే ప్రతిఫలం ఏమీఉండదు సరిగదా ఒక్కొక్కసారి నీకు అపకారంకూడా జరుగవచ్చు. కనక ఈ విష యంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆ వ్యక్తిని గురించిన ఆచూకీ నీకు బాగా తెలిస్తేనేగాని నువ్వు అలాంటి సాహసకృత్యానికి దిగకూడదు.

సరే!...ఆవ్యక్తి ముఖస్తుతులంటే మురిసిపోతా డని విన్నావు. అంతటితో నీపని తేలికయి పోయిందా?...అసలు చిక్కంతా ఇక్కడేఉంది. అతడు ఎంత చేటు ముఖస్తుతులకి లొంగే మనిష యినా "నా ఎదురుగావచ్చి నన్ను స్తుతించండి చాలు—నేను మీకందరికీ ఎవరెవరికి ఏ ఏ పనులు కావలసినా చేసిపెడతాను — అవి సత్కార్యాలైనా సరే! అఘాయిత్యాలైనా సరే!—ఏటొచ్చీ నాకు కావలసింది ముఖస్తుతేసుమండీ!" అని పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డుకడతాడా?...కాక, వచ్చిన వాళ్ళందరికీ చెప్తాడా?...ఏమీ చెయ్య డుగా!...అంతేకాదు. నువ్వు స్తుతిస్తూంటే అతగాడి అంతరాత్మలో ఎంతో తృప్తికలిగినప్పటికీ పైకి

మాత్రం తనలో నువ్వు చెప్పినన్ని సుగుణాలేమీ లేవనీ తను అంత పొగడ్తలకి తగడనీ, నువ్వు అతని మీద నీకున్న అభిమానంకొద్దీ అంతగా పొగుడుతున్నావనీ అంటూ కొంచెం చిరాకుతో కూడిన సిగ్గునభినయిస్తాడు తనకి ముఖస్తుతులంటే ఎంతో చిరాకు అన్నట్టుగా. అదుగో అక్కడే దొరికిపోతాడు ఆవ్యక్తి. నువ్వుకూడా సరిగ్గా అక్కడే తప్పటడుగు వెయ్యబోతావు. ఆయన ప్రదర్శించే విముఖత్వానికి, చిరకోపానికి వెనుకఉన్న సిగ్గు దొంతరలు, పొగడ్తలు పొందాలనే కోరిక గమనించకుండా "పాపం! ఆయనకివన్నీ కిట్టవులా ఉంది. అతిగా పొగిడి ఆయన కోపానలంలో దగ్ధమయేస్థితిలో ఉన్నట్టున్నాను. ఇకనైనా నేను కాస్త ఒళ్ళు దగ్గిరపెట్టుకుని, మోతాదు కాస్త తగ్గించి ఆయనను సంతోషపెట్టాలి" అని అనుకుని పొగడడం మానివేస్తావు. అంతే! ఆక్షణంలోనే నీ పతనం ప్రారంభమయిందని చెప్పవచ్చును... నువ్వు ఇంకా స్తుతించాలనే కోరిక ఆయనకు పూర్తిగా ఉంది. పైకిమాత్రం మొహమాటంచేత అలాగ అంటాడు. ఆ విషయం గ్రహించవలసిన బాధ్యత నీది—నీ ఇంటికి వచ్చిన అతిథి భోజనం దగ్గర నెయ్యివెయ్యమని పదేపదే అడుగుతాడా?.. నువ్వే గ్రహించి వెయ్యాలి. తీరా నెయ్యివడ్డించబోతే—అది మొదటిసారైనా సరే!——ఆయన వద్దని అంటాడు. అలా అన్నాడుగదా అని ఇక ఆయనకు నెయ్యి వెయ్యనంటావా?...ఆయన వద్దని అనటం, నువ్వు మరీ మరీ అడిగి వెయ్యడం మామూలుగా జరిగేపనేగా!——అల్లాగే ఆయన పైకి అలాఅన్నప్పటికీ నువ్వు పొగడ్తలు ఆపుచెయ్యకూడదు. అలా ఆపుచేస్తే నువ్వు ఆయన ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది. ఆ ఆగ్రహాన్ని ఆయన ప్రదర్శించరు. దాని ఫలితం మాత్రం నువ్వు అనుభవించవలసి వస్తుంది.

ఇంతకథ ఉండబట్టే దీన్ని కళగా పరిగణించవలసి వస్తోంది. ఈ కళని అభ్యసించడం అందరివల్లా అవదు. అది కొందరికి ఉగ్గుపాలతో పెట్టిన విద్య. వారు జీవితరంగంలో ఇక ఏ యితరమైన పనికంటె ఇందులో బాగా రాణిస్తారు. వారివారి ప్రతిభనుబట్టి ఈ కళ అనంతమైన వికాసాన్ని పొందుతుంది. దీనికి ముఖ్యంగా చమత్కారంగా సందర్భశుద్ధితో మాట్లాడగలగడం చాలాఅవసరం.

ఈ కళ ఎంతో పూర్వకాలంనుంచి ప్రచారంలో ఉన్నట్టు మనకు పూర్వగాథలు తెలుపుతున్నాయి. హనుమంతుడు తప్ప ఇంకెవరూ అంతటి సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించలేరని తెలుసు. కొన్న వానరశ్రేష్ఠులందరూ జేరి "నీ అంత బలశాలి మరొకడెవడున్నాడు?...నీ శక్తిని నువ్వు గుర్తించక నువ్వు ఊరికే అలా అధైర్య పడుతున్నావు గాని నువ్వేమిటి?—ఈ సముద్రాన్ని దాటలేకపోవడమేమిటి?" అని స్తుతించే సరికి ఎంతో ధైర్యంవచ్చి ఒక్కగంతు వేశాడు—లంకలో పడ్డాడు. ఇలాటి సందర్భాలు ఇంకా చాలాచోట్ల ఉన్నాయి. దీనివల్ల కావలసిన ఫలితాలను పొందగలమా?- అన్న అనుమానం అక్కర్లేదు...నాటినుండి నేటివరకు అంతరించకుండా నానాటికీ వృద్ధిపొందుతున్న కళ యిది...ఇది ఒక కళగా పరిగణించబట్టే మహారాజులు వందిమాగధులను పోషించేవారు. వారు చేసే స్తోత్రపాఠాలు కేవలం ప్రముఖుల రాకను తెలుపటానికేగాక వారిస్థితి వారికి గుర్తుచేసి ఆ స్థితికి తగినట్లుగా వారు ప్రవర్తించేటట్లు వారిని హెచ్చరించటానికి కూడా ఉపయోగపడేవి.

దీనిని కళగా స్వీకరించి ఉపాసించటానికి అందరూ అర్హులుకారు. కొందరే దీనిని అభ్యసించడానికి తగినవారు. వారికి పుట్టుకతోనే దీనికి కావలసిన సాధనసంపత్తి, ప్రతిభ...మొదలైనవన్నీ ఉంటాయి. వారుగనక దీనిని సాధనచేస్తే బాగా రాణిస్తారు. అలాకాక అయినవాడు కాని వాడు దీనిని సాధన చెయ్యబోతే వారు చాలా నవ్వులపాలవుతారు. అందరికీ అంత తేలికగా అబ్బేందుకు ఇది కళగాని మరొకటేమీకాదు. అందుచేత దానికి తగినవారు ఎంతో జాగ్రత్తగా ఉపాసించి, సిద్ధహస్తు లనిపించుకుని అప్పుడు ప్రయోగించాలి. ఈ విషయంలో తగినశ్రద్ధ తీసుకోక ప్రమాదాల్లో చిక్కుకున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు.

ఆ కళలో నిష్ణాతుడైతే అసలు స్తుతిస్తున్నట్టు కనిపించకుండానే స్తుతించ గలుగుతాడు. సంభాషణ నడపడంలో మంచి చాకచక్యం చూపిస్తాడు. పూవు పుట్టడంతోటే పరిమళం వెదజల్లుతుందన్నట్టు ఆ చతురుడు మొదలుపెట్టేసరికే వాని ప్రతిభ

గోచరమవుతుంది. శరభయ్యా ఈ కోవకు చెందిన ప్రజ్ఞానిధి. ఉదాహరణకు శరభయ్యా ఒక ఉపన్యాసకుని పలుకరించిన తీరు చూద్దాం.

ఆయన ఊరునుంచి రావడంతోటే శరభయ్యా వెళ్ళి "ఏమండీ! ఈ మధ్యన ఎడతెరిపి లేకుండా కార్యక్రమాలే కాబోలు తమకు...వారంరోజుల నించి మీకోసం కళ్ళు కాయలు కాస్తున్నాయనుకోండి...ఎక్కడున్నారని!...ఎప్పుడొస్తారని!... ఏమిటో నాపిచ్చిగాని మీకోసం కాచుకొక్కుచుంటే పనులవుతాయా? మీరు ఒకచోట ఉండడం ఒకలోకమని ఏమన్నా ఉంటేనా!... మీరు ఎక్కడుంటున్నదీ ఏ రోజు కా రోజు పేపర్లలో చూస్తున్నామనుకోండి ... ఈ పేపర్లంటూ ఉన్నాయి గనక గాని లేకపోతే మరీ బాధపడవలసి వచ్చును...అయినా...నాపనయితే —ఇవాళ కాకపోతే—రేపాయిరి! అనుకుందును... అలాకాదే!...ఆ వచ్చినవాళ్ళు పొరుగూరువాళ్లు. వచ్చి అయిదురోజులయింది. మీచేత వాళ్ళ ఊళ్లో చిన్న వంతెనకి ప్రారంభోత్సవం చేయించుకోవాలనిట...అక్కడికీ నేను చెప్పాను——మీకసలు తీరుబడి అవదని. నాకుమాత్రం తెలియదూ- మీ కార్యక్రమపు ఒత్తిడి...అందుకే చెప్పాను మీరు రారని...వాళ్ళు నా మాట వింటేనా! ఆయనకు ఎప్పటికి తీరుబడి అయితే అప్పుడే ఏర్పాటు చేస్తాం అంటారు. ఓ పట్టాన వదలరు గదా!...పైగా నామాట మీరు కాదనరని ఎవరో అన్నారుట...నన్ను పట్టుకు వదలటంలేదు. ఎలాగయినా చెప్పి వప్పించమంటారు... అదేం లాభం లేదయ్యా! నా గొప్పేమిటి?...ఏదో వెనక నేనడిగినవి చేశారంటే అప్పుడాయనకు తీరుబడి అయింది గనక చేశారు. అంతేగాని అప్పుడేదో చేశారు గదా అని రోజూ అడగడానికి నాకైనా తెలివి ఉండొద్దా! అందులోనూ ఆయనకు తీరికలేదని తెలిసి ఉండీ కూడా...అదీకాక, ఆయనదగ్గిర నా గొప్పేమిటి? ఆయనకు తీరికంటూ ఉండాలే గాని, ఎవరుచెప్తే కాదంటారు గనకను అన్నాను. ఎంత చెప్పినా వాళ్ళు వినిపించుకోవటంలేదు. ఏం చెయ్యను? రోజూ మీ దర్శనం చేసుకుందామని వస్తున్నాను...దానికేం? ఇవ్వి ఎప్పుడూ ఉండేవే మీ ప్రయాణం కులాసాగా జరిగిందా!...సభలు' సంరంభాలను గురించి మేం పేపర్లలో చదివామనుకోండి!...నేనడిగేది మీ ఆరోగ్యం మాట... మీరు ఎవరడిగినా కాదనరు...ఈ వయస్సులో ఇన్ని ప్రయాణాలు పడవనుకోండి...మీరు అంత ఓపికగా అన్నీ చేస్తున్నారు గాని, నేనయితేనా— ఏమీ చెయ్యలేను...నాకు మీ వయస్సు వచ్చేసరికి అసలు ఓపిక ఉండొద్దూ!..." అని పొగడినట్టు కనిపించకుండా పొగడగలడు. అది ముఖస్తుతిలాగ ఎవరికీ అనిపించదు. కాని సిసలైన ముఖస్తుతి ఇలాంటి మాటలతో ఎన్నో పనులు చేయించుకుంటాడు శరభయ్యా. ఒకవేళ అతని పేరెప్పుడూ పేపర్లలో పడకపోయినాగాని తననుగురించి ఇంత ఘనంగా మాట్లాడిన శరభయ్యా మాటల్లోని అసత్యాన్ని ఆయన కాదనలేడు. ఆయనకు అంతకంటె ముఖ్యమైన పని మరొకటి ఉన్నాగాని శరభయ్యా కోరికను మన్నించక మానడు. ఆ వ్యక్తి తన చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మ అయేవరకూ శరభయ్యా వానిని వదలడు.

అయితే ఇది అందరివల్లా అవదు. శరభయ్యాలాగ ప్రవర్తించటానికి ప్రయత్నించి విఫలులైన వారు అనేకులున్నారు. వారు శరభయ్యా మాట్లాడిన ముక్కలు నాలుగు అదే ఫక్కీలో అనగలుగుతారుగాని, శరభయ్యకున్న సమయస్ఫూర్తి ఎక్కడిది వారికి? అందుచేత వారంతా ఎక్కడో ఒకచోట తప్పటడుగువేసి తీరుతారు. దాంతో నిజంబయట పడుతుంది. ఇది చాలా కష్టమయిన పని. స్తోత్రపాఠం కాస్త ఎక్కువయితే అతడు పసిగట్టేస్తాడు నువ్వు పొగుడుతున్నావని. అందుచేత జాగ్రత్తగా ఎంతవరకూ అవసరమో అంతవరకు తెలివితేటలతో, చమత్కారంగా ముఖస్తుతి చెయ్యగలవాడి రోజులివి. అందుచేత దానిలో అభిరుచిగలవారు తగిన కృషిచేస్తే వారికి జీవితంలో రాణించే అవకాశాలు తప్పకుండా ఉంటాయి. మిగిలిన కళలలాగ ఈ కళను ఉపాసించి చెడినవారు అరుదు.